STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను


తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 128 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 22 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

కూటమి పాలనకు

ప్రజామోదం



ఈవీఎం, బ్యాలెట్.. ఏదైనా విజయం మాదే

- డబుల్ నుంచి ట్రిపుల్ ఇంజిన్‌గా సర్కారు
- వైసీపీ 63 పిటిషన్ల కుట్రను తిప్పికొట్టారు
- ఆదరణ లేని ఎమ్మెల్యేలు తీరు మార్చుకోవాలి
- పార్టీకి కార్యకర్తే అధినేత.. బీసీలే వెన్నెముక
- విభేదాలున్నా మానవీయ బంధాలను గౌరవించాలి
- పెట్టుబడుల రక్షణకు ప్రత్యేక చట్టం తెస్తాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబర్ 21 (సమయం న్యూస్) : మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ ఎన్నికల్లో ప్రజలు కూటమికి అన్ని స్థాయిల్లో బ్రహ్మరథం పట్టారని, ఈ తీర్పు తమ రెండేళ్ల పాలనకు ఇచ్చిన గుర్తింపు అని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్.. ఏ విధానంలో ఎన్నికలు జరిగినా కూటమిదే విజయమని తేలిపోయిందన్నారు. శనివారం అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు డబుల్ ఇంజిన్‌గా ఉన్న ప్రభుత్వం, తాజా ఫలితాలతో మూడు స్థాయిల్లో 'ట్రిపుల్ ఇంజిన్' సర్కారుగా మారిందని వ్యాఖ్యానించారు. ప్రజాతీర్పును వినయంగా స్వీకరిస్తున్నామని, ఇది తమ బాధ్యతను మరింత పెంచిందని చెబుతూ నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్, డీలిమిటేషన్ అంశాలను సాకుగా చూపి ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ ఏకంగా 63 పిటిషన్లు వేసిందని ధ్వజమెత్తారు. హింసకు పాల్పడిన వారే తిరిగి ఫిర్యాదులు చేస్తూ రాజకీయ డ్రామాలకు తెరతీసినా ప్రజలు నమ్మలేదన్నారు. కూటమి ధర్మాన్ని పాటించడం వల్లే మంచి

మిగతా 2 లో

గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా

పుష్కరాల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

2



కూటమి పాలనపై గవర్నర్‌కు వైసీపీ ఫిర్యాదు

- ప్రభుత్వాన్ని రద్దు చేయాలని వినతి
- రాష్ట్రపతి, పార్లమెంటుకు సిఫారసు చేయాలని విజ్ఞప్తి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పాలన సాగిస్తోందని, శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గవర్నర్‌ను కలిశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పలువురు నాయకులు గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, ఈ మేరకు రాష్ట్రపతికి, పార్లమెంటుకు సిఫారసు చేయాలని ఆయనను విజ్ఞప్తి చేశారు.

3

నామినేషన్ల పరిశీలనలో ఉద్రిక్తత

- జనసేన కార్యకర్త మృతి
- నాగులగుట్టపల్లెలో విషాదం
- టీడీపీ నేతల వేధింపులే కారణమని జనసేన ఆరోపణ
- మృతదేహంతో కార్యకర్తల ఆందోళన

3





కారు ప్రమాదం.. పెళ్లి ఇంట విషాదం

పెళ్లూరు వద్ద కాలువలో పడ్డ పెళ్లి బృందం కారు

నలుగురు దుర్మరణం.. బయటపడ్డ నవ దంపతులు

తిరుమల దర్శనం ముగించుకుని వస్తుండగా ఘటన

ఒంగోలు, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని పెళ్లూరు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి బృందంతో తిరుమల నుంచి బాపట్లకు వస్తున్న కారు అతివేగంతో అదుపుతప్పి కల్వర్టును బలంగా ఢీకొట్టి పక్కనే ఉన్న కాలువలోకి బోల్తా పడింది. పెళ్లూరు రైజ్ కాలేజీ వద్ద ఉదయం సుమారు 6.10 గంటలకు జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కారులో ఉన్న నూతన వధూవరులు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రమాద ధాటికి మారుతీ సుజుకీ ఎర్టిగా కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. డ్రైవర్ ప్రవీణ్‌తో పాటు బాపట్లకు చెందిన వెంకట్రావు, సుజాత, సీతామహాలక్ష్మి మృతి చెందగా.. నవ దంపతులు శ్రీతేజ, కౌశల్య గాయపడ్డారు. మృతుల్లో వరుడి తల్లిదండ్రులు, వధువు తల్లి ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో మంగళవాయిద్యాల

మిగతా 3 లో

పెళ్లూరు ప్రమాదంపై నేతల దిగ్భ్రాంతి

3



రాహుల్ వ్యాఖ్యలకు రిజిజు కౌంటర్

- 1962 చైనా యుద్ధంపై క్షమాపణ చెబుతారా?
- దేశాన్ని పేదరికంలో ఎందుకు ఉంచారు?
- భారత్ ప్రతిష్ఠను ఎందుకు తగ్గించారు?
- మోదీని 'రాజీ పడిన ప్రధాని' అన్న రాహుల్

పూర్తి 4లో

గంగానదిపై 'నితీశ్ సేతు'

ఆరు వరుసల భారీ వంతెనను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

- పాట్నా-వైశాలి మధ్య మరింత సులభతరం కానున్న రాకపోకలు
- బిహార్‌లో రూ.34,470 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- రహదారులు, విద్యుత్, సాగునీటి రంగాలకు భారీ ప్రోత్సాహం

4





యలహంక ఆస్తి వివాదంలో షర్మిలకు ఎదురుదెబ్బ

- ఆ ప్రాంగణంలోకి ప్రవేశించొద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- కుటుంబ సభ్యులు, అనుచరులపైనా డిసెంబర్ 19 వరకు నిషేధం

2

అమరావతిలో తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ

- ప్రపంచంలోనే తొలి ప్రత్యేక క్యాంపస్‌గా ఘనత
- నాగార్జున వర్సిటీలో తాత్కాలిక తరగతులు
- ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల్లోనే కార్యకలాపాలు షురూ

2



ఏ.కొండూరులో పులి కదలికలపై నిరంతర నిఘా

ప్రజల భద్రతకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

పులికి హాని కలగకుండా సురక్షితంగా బంధించాలి

అటవీ అధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, నవంబర్ 21 (సమయం న్యూస్): ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు పరిసర గ్రామాల ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా పులి కదలికలు, సంచార ప్రాంతాలు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారంలో పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ స్వయంగా పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. పులి సంచార మార్గాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిసర గ్రామాల ప్రజలకు సమాచారం అందించాలని పవన్ కల్యాణ్ సూచించారు. స్థానిక అటవీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ హనుమాన్ బృందాల ద్వారా విస్తృతంగా గస్తీ నిర్వహించాలని తెలిపారు. పులి కదలికలను కచ్చితంగా గుర్తించేందుకు థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు, ఇతర ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగించాలని ఆదేశించారు. పులి సంచరిస్తున్న ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు, రైతులు, పశువుల కాపరులను అప్రమత్తం చేయాలని, ఎవరూ అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

శాఖల సమన్వయంతో సురక్షిత ఆపరేషన్

అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక పులి ట్రాకింగ్, రెస్క్యూ బృందాలను రప్పించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలు, నిర్దేశిత ప్రోటోకాల్స్‌ను పాటిస్తూ అనుభవజ్ఞులైన నిపుణుల సహకారంతో పులిని సురక్షితంగా పట్టుకోవాలని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో ప్రజలకు గానీ, పులికి గానీ ఎలాంటి హాని కలగకూడదని తేల్చిచెప్పారు. పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, చేపడుతున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

చెన్నై వివాహ వేడుకల్లో మంత్రి లోకేశ్

అనిరుధ్-కావ్య మారన్ రిసెప్షన్‌కు కుటుంబ సమేతంగా హాజరు

రజనీకాంత్‌తో ఆప్యాయంగా ముచ్చటించిన లోకేశ్

స్టాలిన్, ఉదయనిధిలతో మర్యాదపూర్వక భేటీ

ఎంపీ ఎల్.కె. సుధీష్ కుమార్తె రిసెప్షన్‌లోనూ పాల్గొన్న మంత్రి



చెన్నై, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ టీం సీఈవో కావ్య మారన్ వివాహ రిసెప్షన్ వేడుక చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు, తమ తనయుడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు అనిరుధ్, కావ్య మారన్‌లకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. అనంతరం రిసెప్షన్‌కు విచ్చేసిన తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, సూపర్ స్టార్ రజనీకాంత్‌లను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మంత్రి లోకేశ్‌తో ఆప్యాయంగా ముచ్చటించగా, ఇరువురు పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ చిరునవ్వులు చిందించారు. అలాగే మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌తోనూ లోకేశ్ కరచాలనం చేశారు.

ఎంపీ ఎల్.కె. సుధీష్ కుమార్తె రిసెప్షన్‌లో..

రాజ్యసభ సభ్యుడు, డీఎండీకే కోశాధికారి ఎల్.కె. సుధీష్, ఎల్‌కేఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ పూర్ణ జ్యోతి సుధీష్ దంపతుల కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకలోనూ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. చెన్నైలోని ఆర్కే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు హాజరైన ఆయన, నూతన వధూవరులు డాక్టర్ జన్ను సుధీష్, అఖిల్ రవికుమార్‌లకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త జంటను ఆశీర్వదించారు.



కూటమి పాలనకు ప్రజామోదం

(మొదటి పేజీ తరువాయి..)

ఫలితాలు వచ్చాయని, కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదని హితవు పలికారు. అల్లూరి జిల్లా సహా కొన్ని ప్రాంతాల్లోని ఫలితాలను విశ్లేషిస్తున్నామని, ప్రజాప్రతినిధుల పనితీరును అంచనా వేసి అవసరమైన మార్పులు చేస్తామన్నారు. ప్రజల ఆదరణ పొందని ఎమ్మెల్యేలు ఇప్పటికైనా తమ పనితీరును సరిదిద్దుకోవాలని ఆయన హెచ్చరించారు.

రాజకీయాల్లో హుందాతనం కావాలి

పార్టీ లేకుంటే నాయకులు ఉండరని, కార్యకర్త లేకుంటే పార్టీ మనుగడే సాధ్యం కాదని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. 45 ఏళ్లుగా పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్న బీసీలకు ఈ ఎన్నికల్లో అదనపు సీట్లు, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లకు మించి అవకాశాలు కల్పించామని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకూ సముచిత ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. సామాన్యురాలైన కోట పుల్లమ్మకు ఎన్టీఆర్ జిల్లా జడ్పీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడం బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడమేనన్నారు. ఎన్నికల్లో ధన ప్రభావాన్ని తగ్గించి సేవాభావాన్ని ప్రోత్సహిస్తున్నామన్న ఆయన.. ఓటుకు డబ్బు వద్దంటూ అభ్యర్థి ఇచ్చిన నగదును బ్యాలెట్ బాక్సులో వేసిన ఓటరు ఘటన ప్రజల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ప్రజాసేవకే ప్రాధాన్యమివ్వాలి తప్ప వ్యక్తిగత వివాదాలకు దిగకూడదని, రాజకీయాల్లో హుందాతనం ఉండాలని సూచించారు. వైఎస్ షర్మిల తన కుమార్తె వివాహానికి ఆహ్వానించిన అంశాన్ని ప్రస్తావిస్తూ..



రాజకీయ విభేదాలున్నా వ్యక్తిగత, మానవీయ బంధాలను గౌరవించాలని, దీనిపై 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనాలు సరికావని ఆయన విమర్శించారు.

పెట్టుబడులకు అడ్డంకులు తగవు

రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రాకుండా కొందరు అడ్డుకుంటున్నారని చంద్రబాబు మండిపడ్డారు. గతంలో దక్షిణ కొరియా వెళ్లి కియా సంస్థను రాష్ట్రానికి తీసుకొస్తే, ఇప్పుడు దాని అనుబంధ సంస్థ పెట్టుబడులపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంలో అర్థం లేదన్నారు. గత పాలనలో జాకీ వంటి సంస్థలు రాష్ట్రం వీడిపోయాయని, అమర రాజా బ్యాటరీస్‌ను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. పరిశ్రమల

సంక్షేమం, అభివృద్ధిలో రాజీ లేదు

'చెప్పాం.. చేస్తున్నాం.. చేస్తాం' అన్న విధానంతో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఎక్కడా రాజీ పడకుండా హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ నిర్మాణమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చంద్రబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విశాఖపట్నం, కృష్ణా డెల్టాకు తరలిస్తామన్నారు. గత పాలకుల ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజలు పడిన ఇబ్బందులకు స్వస్తి పలికి, వ్యక్తుల చిత్రాలు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. తీవ్ర ఎల్‌నినో ప్రభావంతో పాటు రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని తాకినప్పుడు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించామని, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టం జరగకుండా అండగా నిలుస్తున్నామని ఆయన వివరించారు.

ప్రోత్సాహకాలకు ఎస్క్రో ఖాతా విధానం అమలు చేస్తున్నామని, త్వరలోనే 'పెట్టుబడుల రక్షణ చట్టం' తెచ్చే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం సౌర విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసి రూ.10 వేల కోట్ల ప్రజాధనం వృథా చేసిందని, విద్యుత్ సంస్థలపై రూ.1.30 లక్షల కోట్ల అప్పులు, ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేయలేదని స్పష్టం చేశారు.

గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

- **2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు ఉత్సవాలు**
- **10 కోట్ల మంది భక్తులకు రూ.3,723 కోట్లతో పనులు**
- **440 ఘాట్లలో సౌకర్యాలు.. 135 భాషల్లో ఏఐ చాట్‌బాట్**
- **అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, నవంబర్ 21 (సమయం న్యూస్): 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక సూచనలు చేశారు. 22 శాఖల పరిధిలో రూ.3,723.69 కోట్లతో 4,862 పనులు ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు లభించాయి. ఇందులో 659 పనులు ప్రారంభం కాగా, 69 పనులు పూర్తయ్యాయి.

ఘాట్లలో సౌకర్యాలు.. ప్రత్యేక రవాణా, ఏఐ సేవలు

గోదావరి పరివాహకంలోని 440 ఘాట్ల వద్ద తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వసతి సదుపాయాలతో పాటు 268.12 కిలోమీటర్ల మేర బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రాకపోకల కోసం 4,000 ప్రత్యేక బస్సులు, 649 గ్రీన్ బస్సులు, 1,560 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు 135 భాషల్లో సమాచారం అందించే ఏఐ చాట్‌బాట్, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలు అందుబాటులోకి తీసుకురానున్నారు. పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రజాభాగస్వామ్యంతో పర్యావరణ హితంగా..

యువత, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పుష్కరాలను విజయవంతం చేయాలని



ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల పురోగతి, నిధుల వినియోగాన్ని ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ గోదావరి జలాల నాణ్యతను కాపాడాలని సూచించారు. ఉత్సవాల్లో భాగంగా గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి, భారీ దీపాలంకరణ, గోదావరి ముగ్గు, సామూహిక యోగా వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అమరావతిలో తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ

ప్రపంచంలోనే తొలి ప్రత్యేక క్యాంపస్‌గా ఘనత

నాగార్జున వర్సిటీలో తాత్కాలిక తరగతులు

ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల్లోనే కార్యకలాపాలు



అమరావతి, నవంబర్ 21 (సమయం న్యూస్): రాజధాని అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా మరో కీలక అడుగు పడింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) డీమ్డ్ టు బి యూనివర్సిటీ అమరావతి తాత్కాలిక క్యాంపస్ శనివారం ప్రారంభమైంది. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని సీడీఈ భవనంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ ఎ. ప్రతిభ ఈ క్యాంపస్‌ను ప్రారంభించగా, నీలిట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి పాల్గొన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌గా ఇది నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో అమరావతిలో నీలిట్ ఏర్పాటు చేస్తున్న ఈ విశ్వవిద్యాలయం క్వాంటం వ్యాలీలో నైపుణ్యాభివృద్ధికి కేంద్రంగా నిలుస్తూ అత్యాధునిక సాంకేతిక నిపుణులను తయారు చేయనుంది. శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఆచార్య నాగార్జున వర్సిటీ నుంచి కార్యకలాపాలు కొనసాగనుండటంతో, కొత్త భవనాల కోసం వేచి చూడకుండానే రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, శిక్షణ తక్షణమే అందుబాటులోకి వచ్చింది.

తొమ్మిది నెలల్లోనే కార్యకలాపాలు.. రూ.47 కోట్లతో ల్యాబ్‌లు

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ పరిధిలో 'ఇన్‌స్టిట్యూషన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (డిస్టింక్ట్ కేటగిరీ)' హోదా పొందిన ఏకైక శాస్త్రీయ విశ్వవిద్యాలయం నీలిట్. పంజాబ్‌లోని రూపార్‌లో ప్రధాన క్యాంపస్ ఉండగా, దేశవ్యాప్తంగా 11 అనుబంధ క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపీ ప్రభుత్వం, నీలిట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేగవంతమైన భాగస్వామ్యంతో ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల్లోనే క్యాంపస్ అందుబాటులోకి వచ్చింది. మొదటి దశలో భాగంగా తాత్కాలిక క్యాంపస్‌లో రూ.47 కోట్లతో క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, చిప్ డిజైన్ఉవీఎల్ఎస్ఐ, కంప్యూటింగ్ ల్యాబ్‌లను నీలిట్ ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా ప్రపంచ అగ్రశ్రేణి టెక్నాలజీ సంస్థలు వాడే అత్యాధునిక పరికరాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం లభిస్తుంది. వచ్చే జనవరి నుంచి ఆన్‌లైన్, తరగతి గది విధానాల్లో కోర్సులు ప్రారంభం కానున్నాయి. రెండు నుంచి మూడు నెలల వ్యవధితో క్వాంటం కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సైన్స్ఉఇంజినీరింగ్‌లో ఏఐ, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐవోటీ, మెషిన్ లెర్నింగ్ తదితర 10 అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సులు, ప్రాచుర్యం పొందిన 'ఓ' లెవెల్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తారు. అదనంగా డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్, సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్టింగ్ వంటి 16 స్వల్పకాలిక కోర్సులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కళాశాల అధ్యాపకుల కోసం 10 విభాగాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు.

నిడమర్రులో రూ.730.70 కోట్లతో శాశ్వత క్యాంపస్

దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అమరావతిలోని నిడమర్రు వద్ద రూ.730.70 కోట్లతో నీలిట్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఈ ఏడాది ఆగస్టులో ఆమోదం తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 8.5 ఎకరాల భూమిని కేటాయించగా, భవనాల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటు, నిర్వహణ వ్యయాన్ని నీలిట్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ భరించనున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ క్యాంపస్ ద్వారా 8,250 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 1,650 మందికి డిగ్రీ కోర్సులు, 6,600 మందికి నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ అందిస్తారు. క్వాంటం టెక్నాలజీ, ఏఐ, సెమీకండక్టర్లలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్, డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉంటాయి. అమరావతి క్వాంటం వ్యాలీలోని ఐబీఎం క్వాంటం కంప్యూటర్‌పై పనిచేసే అరుదైన అవకాశం కూడా ఇక్కడి విద్యార్థులకు దక్కనుంది. శాశ్వత క్యాంపస్ సిద్ధమైన వెంటనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రయోగశాలలు, అధ్యాపకులు, విద్యార్థులను ఎలాంటి అంతరాయం లేకుండా కొత్త క్యాంపస్‌కు తరలిస్తారు.

తిరుపతికీ విస్తరణ.. భవిష్యత్ పరిశ్రమలకు ఊతం

అమరావతితో పాటు రాయలసీమలోనూ నీలిట్ కార్యకలాపాలను విస్తరించనున్నారు. ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక వసతి నుంచి నడుస్తున్న నీలిట్ తిరుపతికి సొంత శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు మూడు ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనకు ఎస్వీ విశ్వవిద్యాలయం ఇప్పటికే ఎన్ఓసీ జారీ చేసింది. తిరుపతి క్యాంపస్‌లో ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, సెమీకండక్టర్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. జాతీయ క్వాంటం మిషన్, ఇండియా ఏఐ మిషన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా సాగే ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, అధ్యాపకులు, పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. నీలిట్‌లో శిక్షణ పొందే నిపుణులు, పరిశోధకులు అమరావతి క్వాంటం వ్యాలీ వ్యవస్థలో భాగస్వాములు కావడం ద్వారా దేశంలోనే క్వాంటం టెక్నాలజీకి ప్రముఖ కేంద్రంగా, పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ స్థానం మరింత బలోపేతం కానుంది. నేటి ఉద్యోగావకాశాలతో పాటు భవిష్యత్తులో ఆవిర్భవించే పరిశ్రమలకు రాష్ట్ర యువతను సిద్ధం చేయడంలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించనుంది.

కారు ప్రమాదం.. పెళ్లి ఇంట విషాదం

(మొదటి పేజీ తరువాయి..)

నడుమ ఈ నెల 18న (బుధవారం) బాపట్లలో శ్రీతేజ, కౌశల్యలకు ఘనంగా వివాహం జరిగింది. కొత్త జీవితానికి శ్రీకారం చుట్టిన ఆనందంతో, వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకునేందుకు ఈ నెల 19న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు బయలుదేరారు. శుక్రవారం భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆనందంగా ఇంటికి చేరుకోవాలన్న ఆశతో బాపట్లకు తిరుగు ప్రయాణమయ్యారు. మరికొద్ది గంటల్లో సొంతూరుకు చేరుకుంటారనగా విధి వక్రించింది. పసుపు తాడు మెడలో పడి మూడు రోజులు కూడా గడవకముందే, కళ్లముందే ఆత్మీయులను కోల్పోవడంతో ఆ నవ దంపతుల రోదనలు చూపరులను కలచివేశాయి. పెళ్లి సందడితో, నవ్వులతో కళకళలాడిన ఆ ఇళ్లలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. "ఈ నెల 18న బాపట్లలో శ్రీతేజ, కౌశల్యకు వివాహమైంది. 19న రాత్రి తిరుమల వెళ్లి, శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత



బాపట్లకు వస్తుండగా జరిగిన ప్రమాదంలో నలుగురు చనిపోయారు.. మరో ఇద్దరు గాయపడ్డారు" అంటూ బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

నిద్రమత్తే ప్రాణాలు తీసింది!

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన శ్రీతేజ, కౌశల్యను 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి పంపారు. సుదూర ప్రయాణం వల్ల డ్రైవర్ నిద్రమత్తుకు గురికావడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై ఒంగోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పాలనపై గవర్నర్‌కు వైసీపీ ఫిర్యాదు

- ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దు చేయాలని వినతి
- రాష్ట్రపతి, పార్లమెంటుకు సిఫారసు చేయాలని విజ్ఞప్తి
- పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా పనిచేయాలని డిమాండ్



విజయవాడ, నవంబర్ 21 (సమయం న్యూస్) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పాలన సాగిస్తోందని, శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గవర్నర్‌ను కలిశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో పలువురు నాయకులు గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, ఈ మేరకు రాష్ట్రపతికి, పార్లమెంటుకు సిఫారసు చేయాలని ఆయనను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని బొత్స సవాల్ విసిరారు. గవర్నర్‌తో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేష్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, మొండితోక అరుణ్‌కుమార్, రమేష్ యాదవ్, కల్పలత రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలి

ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజకీయ దాడులు, అధికార దుర్వినియోగం పెరిగిపోయాయని ఆరోపించారు. తాడిపత్రిలో జరిగిన ఘటనలు, కడపలో అవినాష్ రెడ్డిపై పెట్రోల్ బాంబులతో దాడి జరిగిందన్న అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వాహనాలు దగ్గమైన ఘటనను పెట్రోల్ బాంబుల దాడిగా కాకుండా, టపాసుల వల్ల జరిగినట్లు డీఎస్పీ స్థాయి అధికారి పేర్కొనడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా పనిచేయాలని బొత్స డిమాండ్ చేశారు.



నామినేషన్ల పరిశీలనలో ఉద్రిక్తత..

- జనసేన కార్యకర్త మృతి.. నాగులగుట్టపల్లెలో విషాదం
- టీడీపీ నేతల వేధింపులే కారణమని జనసేన ఆరోపణ
- మృతదేహంతో నడిరోడ్డుపై కార్యకర్తల ఆందోళన
- బీటెక్ రవి, మహేశ్వర రెడ్డి పాత్రపై సమగ్ర విచారణకు పట్టు
- ధర్నాలో పాల్గొన్న జనసేన నేత సుంకర శ్రీనివాస్

కడప, నవంబర్ 21 (సమయం న్యూస్) : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గ పరిధిలోని చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీకి చెందిన ముంతల రామాంజులు (50) మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు రామాంజులు మృతదేహాన్ని నడిరోడ్డుపై ఉంచి ధర్నాకు దిగారు. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ సుంకర శ్రీనివాస్ ఈ ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

నిష్పక్షపాత విచారణకు జనసేన డిమాండ్

నామినేషన్ల పరిశీలన సందర్భంగా జనసేన పార్టీ అభ్యర్థులు, నాయకులు ఎదుర్కొన్న ఇబ్బందులు, టీడీపీ నాయకులు, వారి అనుచరులపై వచ్చిన బెదిరింపులు, వేధింపుల ఆరోపణల నేపథ్యంలోనే ఈ దురదృష్టకర ఘటన చోటుచేసుకుందని జనసేన శ్రేణులు ఆరోపిస్తున్నాయి. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి, చక్రాయపేట మండల టీడీపీ అధ్యక్షుడు మహేశ్వర రెడ్డి పాత్రతో పాటు ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్నా సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ తక్షణమే స్పందించి మృతికి దారితీసిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలు, రాజకీయ జోక్యాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని జనసేన నాయకులు కోరారు.

యలహంక ఆస్తి వివాదంలో షర్మిలకు ఎదురుదెబ్బ

- ఆ ప్రాంగణంలోకి ప్రవేశించొద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు

బెంగళూరు, నవంబర్ 21 (సమయం న్యూస్) : బెంగళూరులోని విలాసవంతమైన యలహంక ఆస్తి వివాదంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సదరు ఆస్తిలోకి వైఎస్ షర్మిల ప్రవేశించకూడదని స్పష్టం చేస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం షర్మిల మాత్రమే కాకుండా ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు, మద్దతుదారులు ఎవరూ ఆ ప్రాంగణంలోకి అడుగుపెట్టకుండా, ఆస్తి వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం చేసుకోకుండా డిసెంబర్ 19 వరకు నిషేధం విధించింది. దేవనహళ్లి సీనియర్ సివిల్ జడ్జి, జేఎంఎఫ్‌సీ కోర్టులో సిలికాన్ బిల్డర్స్ తరఫున భీమిశెట్టి రమేశ్‌బాబు ఈ నెల 20న పిటిషన్ దాఖలు చేయగా, 21న దానికి నంబరు కేటాయించారు. ఈ వివాదంపై విచారణ సందర్భంగా ఆ ఆస్తి 2027 ఫిబ్రవరి వరకు తమ లీజులోనే ఉందని, ప్రస్తుతం పూర్తిగా తమ స్వాధీనంలోనే కొనసాగుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. తమ వాదనలకు మద్దతుగా లీజు ఒప్పంద పత్రాలు, క్రమం తప్పకుండా చెల్లిస్తున్న అద్దె రసీదులు, విద్యుత్ బిల్లులను న్యాయస్థానం ముందుంచారు. ఆ పత్రాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన కోర్టు, ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకుని సిలికాన్ బిల్డర్స్ హక్కులకు భంగం కలగకుండా మధ్యంతర నిషేధాజ్ఞలు జారీ చేసింది. యలహంక ప్యాలెస్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సోదరి వైఎస్ షర్మిల మధ్య ఆస్తుల వివాదం తాజా పరిణామంతో మరో మలుపు తిరిగింది. ఈ నెల 25న జరగనున్న తన కుమార్తె అంజలి వివాహాన్ని తొలుత యలహంక ప్యాలెస్‌లోనే నిర్వహించాలని నిర్ణయించుకున్న షర్మిల, అదే వేదిక వివరాలతో ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంచారు. అయితే అక్కడ పెళ్లి చేయడానికి వీల్లేదంటూ జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'నేను నివసిస్తున్న ప్రాంగణంలో పెళ్లి చేస్తే తీవ్ర భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయి. అందరి దృష్టి నా నివాసంపై పడుతుంది. ఇది నా ఇల్లు, ఇక్కడ నా కుటుంబం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనుకుంటున్నాను' అంటూ ఆయన షర్మిలకు లేఖ రాశారు. జగన్ అభ్యంతరంతో వివాహ వేదికను హైదరాబాద్‌కు మార్చుకున్నప్పటికీ, కుటుంబ సంప్రదాయం ప్రకారం యలహంక నివాసంలోనే పెళ్లి కుమార్తెను చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని షర్మిల భావించారు. ఇందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఆదివారం సాయంత్రం బెంగళూరుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న జగన్ వర్గం, యలహంక ఇంట్లోకి షర్మిలను గానీ ఆమె తరఫు వ్యక్తులను గానీ అనుమతించకుండా స్టే కోరుతూ సిలికాన్ బిల్డర్స్ పేరుతో కోర్టును ఆశ్రయించడంతో వివాదం మరింత ముదిరింది.

యలహంక భూమి షర్మిలదేనన్న విజయమ్మ

ఇదిలా ఉండగా బెంగళూరులోని యలహంక భూమి తన కుమార్తె షర్మిలదేనని మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి విజయమ్మ గతంలోనే స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి తన సోదరికి రాసిచ్చిన ఎంవోయూలోని ప్రతి ఆస్తితో పాటు సరస్వతి సిమెంట్, ఎంవోయూలో లేని యలహంక భూమి కూడా షర్మిలకే చెందుతుందని ఆమె ఇదివరకే తేల్చిచెప్పారు. ఈ మేరకు ఈ ఏడాది మార్చి 20న 'క్లారిఫికేషన్' పేరిట న్యాయవాదితో నోటరీ చేయించి మరీ బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి నేపథ్యంలో కుమార్తె వివాహ వేడుకల వేళ యలహంక ఆస్తిలోకి షర్మిల వర్గం ప్రవేశించకుండా న్యాయస్థానం డిసెంబర్ 19 వరకు నిషేధం విధించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



పెళ్లూరు ప్రమాదంపై నేతల దిగ్భ్రాంతి

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం
- శుభకార్యం వేళ విషాదం కలచివేసిందన్న వైఎస్ జగన్
- మృతుల కుటుంబాలకు పవన్, లోకేశ్, మంత్రుల సానుభూతి
- నిద్రమత్తులో వాహనాలు నడపవద్దని వాహనదారులకు సూచన

అమరావతి, నవంబర్ 21 (సమయం న్యూస్) : ప్రకాశం జిల్లా పెళ్లూరు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు పలువురు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతి నుంచి బాపట్లకు వస్తున్న పెళ్లి బృందం కారు కల్వర్టును ఢీకొని ప్రవీణ్, వెంకట్రావు, సుజాత, సీతామహాలక్ష్మి ప్రాణాలు కోల్పోయారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గాయపడిన నవ దంపతులను 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వివాహ వేడుక ముగించుకుని వస్తుండగా ఒకే కుటుంబానికి చెందిన వారు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

పెళ్లూరు రోడ్డు ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశిస్తూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డీఎస్‌బీవీ స్వామి ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నూతన వధూవరులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. సుదూర ప్రయాణాలు చేసేటప్పుడు అలసటగా ఉన్నా, నిద్రమత్తు ఆవహించినా వాహనాలు నడపవద్దని మంత్రులు, పోలీసులు వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

శుభకార్యం వేళ విషాదం కలచివేసింది

పెళ్లూరు దుర్ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతి నుంచి బాపట్లకు వస్తున్న పెళ్లి బృందం కారు కల్వర్టును ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. శుభకార్యానికి వెళ్లి వస్తున్న కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆటోనగర్ బొమ్మల ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

- సుమారు రూ.6 కోట్ల విలువైన ఎలక్ట్రికల్ టాయ్స్ దగ్ధం
- విదేశాలకు ఎగుమతి చేయాల్సిన సరుకు కాలిబూడిద



విజయవాడ, నవంబర్ 21 (సమయం న్యూస్): నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఓ బొమ్మల తయారీ కంపెనీలో శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో విదేశాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన కోట్లాది రూపాయల విలువైన ఎలక్ట్రికల్ టాయ్స్ పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆటోనగర్ అగ్నిమాపక, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సమన్వయంతో శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విదేశాలకు ఎగుమతి చేసే పలు రకాల ఎలక్ట్రికల్ బొమ్మలు అగ్నికి ఆహుతి కావడంతో భారీ నష్టం వాటిల్లిందని కంపెనీ నిర్వాహకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.6 కోట్ల నష్టం అంచనా.. ఫిర్యాదు మేరకు చర్యలు

ప్రమాదానికి గల కారణాలు ప్రస్తుతానికి తెలియరాలేదని పటమట సీఐ పవన్ కిశోర్ తెలిపారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందిన వెంటనే ఫైర్, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా నిరోధించగలిగామని, దీనివల్ల ప్రాణనష్టంతో పాటు మరింత ఆస్తినష్టం జరగకుండా అడ్డుకున్నామని వివరించారు. ఫిర్యాదులకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మరోవైపు ఆటోనగర్‌లోని ఈ కంపెనీ నుంచి అమెరికా, చైనా, బ్యాంకాక్, దుబాయ్ దేశాలకు పలు రకాల ఎలక్ట్రికల్ టాయ్స్ ఎగుమతి అవుతుంటాయని ఐలా ఉపాధ్యక్షుడు దుర్గారావు తెలిపారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో దాదాపు రూ.6 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోందని పేర్కొన్న ఆయన, మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక, పోలీసు సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశారని అభినందించారు.



జేఈఈ మెయిన్ దరఖాస్తులకు
నేడే ఆఖరి గడువు!

నేడు అర్ధరాత్రి వరకు దరఖాస్తులకు అవకాశం

ఇప్పటివరకు 13.29 లక్షల మంది అభ్యర్థుల నమోదు

రూ.500 ఆలస్య రుసుముతో నవంబర్ 26 వరకు అవకాశం

జనవరి 20 నుంచి తొలి విడత పరీక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 22 (సమయం న్యూస్): జేఈఈ మెయిన్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు నేటితో ముగియనుంది. నవంబర్ 22 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) వెల్లడించింది. అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 13.29 లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 11.19 లక్షల మందికిపైగా రుసుము చెల్లించి దరఖాస్తులను విజయవంతంగా సమర్పించినట్లు తెలిపింది. దరఖాస్తు నమోదు చేసుకోవడంతోనే ప్రక్రియ పూర్తయినట్లు కాదని, నిర్ణీత రుసుము చెల్లించి నిర్ధారణ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఎవరూ తమ దరఖాస్తులను అసంపూర్తిగా వదిలేయవద్దని సూచించింది. సాధారణ గడువులోగా దరఖాస్తు చేసుకోలేని అభ్యర్థులకు రూ.500 ఆలస్య రుసుముతో నవంబర్ 26 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షలను జనవరి 20, 21, 22, 23, 24, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల షెడ్యూల్, దరఖాస్తులు, ఇతర తాజా సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://jeemain.nta.nic.in/ను సందర్శించాలని ఎన్‌టీఏ సూచించింది. సందేహాల నివృత్తికి 011-40759000, 1800-180-4747 నంబర్లలో లేదా jeemain@nta.ac.in ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది.

పెళ్లిళ్లు చేసుకోండి..
ఎక్కువ మంది పిల్లలను కనండి!

అమెరికా యువతకు కరోలిన్ లీవిట్ పిలుపు

ఇస్లాం జనాభా వేగంగా పెరుగుతోందంటూ నివేదిక ప్రస్తావన

జీవన వ్యయం పెరుగుతుంటే పిల్లల పోషణ ఎలా అంటూ నెటిజన్ల ప్రశ్నలు



వాషింగ్టన్, నవంబర్ 22 (సమయం న్యూస్): అమెరికా యువత పెళ్లిళ్లు చేసుకుని ఎక్కువ మంది పిల్లలను కనాలని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా పనిచేసిన కరోలిన్ లీవిట్ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా మతాల వారీగా జనాభా పెరుగుదలపై వెలువడిన నివేదిక నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. క్రైస్తవులతో పోలిస్తే ముస్లిం జనాభా వేగంగా పెరుగుతోందని పేర్కొంటూ, అమెరికా యువత కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పిల్లల్లో దేశం పట్ల ప్రేమను పెంపొందించాలని కోరారు. ప్రపంచంలో ఇస్లాం, క్రైస్తవ మతాల జనాభా పెరుగుదలపై ప్యూ పరిశోధనా కేంద్రం అంచనాలను ప్రస్తావిస్తూ వాషింగ్టన్ పోస్ట్‌లో వచ్చిన కథనంపై లీవిట్ స్పందించారు. రానున్న కాలంలో ముస్లిం జనాభా మరింత వేగంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా యువత వివాహాలు చేసుకుని పెద్ద కుటుంబాలను ఏర్పరచుకోవాలని సూచించారు. అయితే 2035 నాటికే ఇస్లాం ప్రపంచంలో అతిపెద్ద మతంగా అవతరిస్తుందనే ప్రచారానికి ప్యూ పరిశోధనా కేంద్రం అంచనాలతో స్పష్టమైన ఆధారం లేదు. ఆ సంస్థ గత అంచనాల ప్రకారం క్రైస్తవులు, ముస్లింల జనాభా సంఖ్యలు ఈ శతాబ్దం మధ్యకాలం తర్వాత మరింత దగ్గరయ్యే అవకాశముంది. మరోవైపు లీవిట్ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె సూచనలను సమర్థిస్తుండగా, మరికొందరు అమెరికాలో పెరుగుతున్న జీవన వ్యయం, గృహ ఖర్చులు, పిల్లల విద్య, వైద్య అవసరాలను ప్రస్తావిస్తున్నారు. ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా యువ దంపతులు ఎక్కువ మంది పిల్లలను కనడానికి వెనుకాడుతున్నారని అభిప్రాయపడుతున్నారు. కుటుంబాల ఆర్థిక భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టకుండా జనాభా పెంపుపై పిలుపునివ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దీంతో లీవిట్ వ్యాఖ్యలు అమెరికాలో కుటుంబ వ్యవస్థ, జనాభా పెరుగుదల, జీవన వ్యయంపై కొత్త చర్చకు దారితీశాయి.

చెత్త వేసినా, కాల్చినా భారీ జరిమానా

న్యూఢిల్లీ, నవంబర్ 22 (సమయం న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతోపాటు పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) కఠిన చర్యలకు సిద్ధమైంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చేవారికి రూ. 10 వేల జరిమానా విధించనున్నది. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి రూ. 1,000 జరిమానా విధించాలని నిర్ణయించింది. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించడం తప్పనిసరి చేయనున్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే రూ. 500 జరిమానా విధిస్తారు. నిబంధనలు పాటించని హోటళ్లకు రూ. 75 వేలు, రెస్టారెంట్లకు రూ. 30 వేల వరకు జరిమానా విధించేలా ప్రతిపాదనలు రూపొందించారు. భారీగా వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు వాటి నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ప్లాస్టిక్, ఇతర ప్యాకేజింగ్ వ్యర్థాల నియంత్రణపైనా ఎంసీడీ ప్రత్యేక దృష్టి సారించింది. తమ ఉత్పత్తుల ద్వారా వెలువడే ప్యాకేజింగ్ వ్యర్థాలను తిరిగి సేకరించేందుకు తగిన వ్యవస్థ ఏర్పాటు చేయని తయారీదారులు, బ్రాండ్ యజమానులకు గరిష్ఠంగా రూ. 1.5 లక్షల జరిమానా విధించాలని నిర్ణయించింది. అంతేకాకుండా జరిమానా మొత్తాలను ప్రతి ఏడాది 5 శాతం చొప్పున పెంచాలని స్థాయీ సంఘం తీర్మానించింది. ప్రజలు, వ్యాపార సంస్థల్లో పారిశుద్ధ్య బాధ్యతను పెంపొందించడం, నగరంలో చెత్త సమస్యను నియంత్రించడం, వాయు కాలుష్యాన్ని తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొంటున్నారు. కొత్త నిబంధనల అమలుకు సంబంధించిన తదుపరి అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత జరిమానాలు అమల్లోకి రానున్నాయి.

గంగానదిపై 'నితీశ్ సేతు' ప్రారంభం

- ఆరు వరుసల భారీ వంతెనను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- పాట్నా-వైశాలి మధ్య మరింత సులభతరం కానున్న రాకపోకలు
- బిహార్‌లో రూ.34,470 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- రహదారులు, విద్యుత్, సాగునీటి రంగాలకు భారీ ప్రోత్సాహం
- స్వావలంబన బిహార్ నిర్మాణమే లక్ష్యమన్న ప్రధాని



వైశాలి, నవంబర్ 21 (సమయం న్యూస్): బిహార్‌లోని వైశాలి జిల్లాలో గంగానదిపై నిర్మించిన ఆరు లైన్ల దర్గా-బిదుపూర్ కేబుల్ వంతెన 'నితీశ్ సేతు'ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గౌరవార్థం ఈ వంతెనకు 'నితీశ్ సేతు'గా నామకరణం చేశారు. సుమారు రూ.4,280 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన వంతెన పొడవు సుమారు 9.76 కిలోమీటర్లు కాగా, అప్రోచ్ రోడ్లతో కలిపి మొత్తం కనెక్టివిటీ ప్రాజెక్టు 19.7 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పట్నా జిల్లాలోని కచ్చీ దర్గా (ఎన్‌హెచ్-22)ను వైశాలి జిల్లాలోని బిదుపూర్ (ఎన్‌హెచ్-322)తో ఈ వంతెన కలుపుతుంది. ప్రారంభోత్సవానికి ముందు పట్నా విమానాశ్రయంలో మాజీ సీఎం నీతీశ్ కుమార్‌ను ప్రధాని మోదీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరులు పాల్గొన్నారు. 'నితీశ్ సేతు' ప్రారంభంతో పట్నా, వైశాలి మధ్య ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గనున్నాయి. ఇప్పటికే ఉన్న మహాత్మా గాంధీ సేతు, జేపీ సేతుపై రవాణా భారాన్ని ఇది తగ్గిస్తుంది. గంగానది మధ్యలో ఉండి రవాణా ఇబ్బందులు ఎదుర్కొనే వైశాలి జిల్లాలోని రాఘోపూర్ దియారా ప్రాంత ప్రజలకు పట్నాలోని ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఇతర అత్యవసర సేవలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుంది. ఉత్తర బిహార్‌లోని రైతులకు, వ్యాపారవేత్తలకు ప్రధాన మార్కెట్లకు వేగంగా చేరుకునే మార్గం లభించడంతో పాటు లీచీ, అరటి, మొక్కజొన్న, కూరగాయలు వంటి వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మెరుగుపడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ఈ కారిడార్ లాజిస్టిక్స్, పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. 'నితీశ్ సేతు' నామకరణం, ప్రారంభోత్సవం నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి, ప్రతిపక్ష ఆర్జేడీ మధ్య రాజకీయ మాటల తూటాలు పేలాయి. 2012లో నీతీశ్ కుమార్ సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పేరు పెట్టారని ఎన్డీయే నేతలు సమర్థించారు. మరోవైపు, వంతెన పేరు, క్రెడిట్ విషయంపై ప్రతిపక్షం నుంచి విమర్శలు రాగా.. భాజపా, జేడీ(యూ) నేతలు వాటిని తిప్పికొట్టారు. బిహార్ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సుమారు రూ.34,470 కోట్ల విలువైన ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని మోదీ ఈ పర్యటనలో ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు.

భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు చైనా కుట్రలు

ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు బీజింగ్ సాయం

కీలక పరిశ్రమల సరఫరా వ్యవస్థపై నియంత్రణ

భారత్‌తో సహకారం పెంచుకోవాలని అమెరికాకు సూచన



న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు చైనా సైనిక, ఆర్థిక వ్యూహాలను అమలు చేస్తోందని అమెరికా కాంగ్రెస్‌కు చెందిన యూఎస్-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చైనా మద్దతు అందించిందని పేర్కొంది. సరిహద్దుల్లో ఒత్తిడి పెంచడంతోపాటు, కీలక పారిశ్రామిక ముడి పదార్థాలు, పరికరాల సరఫరాపై ఆంక్షలతో భారత్‌ను నియంత్రించాలని చూస్తోందని తెలిపింది. భారత్-పాక్ మధ్య మూడు రోజులపాటు జరిగిన సైనిక ఘర్షణలో చైనా ప్రత్యక్షంగా పాల్గొనకుండానే పాకిస్తాన్‌కు సాంకేతిక సహకారం అందించిందని నివేదిక పేర్కొంది. చైనా ఇంజినీర్ జాంగ్ హెంగ్ కూడా పాక్ వైమానిక దళానికి సాంకేతిక సాయం అందించిన బృందంలో తాను ఉన్నట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. జే-10సీఈ యుద్ధవిమానాలు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా తమ బృందం సహకరించిందని తెలిపారు. హిందూ మహాసముద్రంలోనూ నౌకాదళ ఉనికి, నిఘా కార్యకలాపాలను చైనా పెంచుతోందని కమిషన్ హెచ్చరించింది. పారిశ్రామిక ముడి పదార్థాలు, సాంకేతికతపై నియంత్రణతో భారత్ పోటీ సామర్థ్యాన్ని తగ్గించాలని చైనా ప్రయత్నిస్తోందని నివేదిక తెలిపింది. కీలక ఉత్పత్తుల ఎగుమతులను పరిమితం చేయడం, ఇంజినీర్లను వెనక్కి పిలిపించడం, ఎలక్ట్రానిక్స్ తయారీకి అవసరమైన పరికరాల సరఫరాలో ఆటంకాలు సృష్టించడం వంటి చర్యలను ప్రస్తావించింది. ఆసియాలో శక్తుల సమతౌల్యాన్ని ప్రభావితం చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందని కమిషన్ పేర్కొంది. చైనా తయారీ, సరఫరా వ్యవస్థలకు ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం భారత్‌కు ఉందని తెలిపింది. ఇప్పటికే భారత్ సైనిక సామర్థ్యాన్ని ఆధునీకరిస్తూ, దేశీయ తయారీని ప్రోత్సహిస్తోందని వివరించింది. అయితే పరిశ్రమలు చైనా యంత్రాలు, విడిభాగాలపై ఆధారపడటం సవాలుగా మారిందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో నిఘా సమాచారం, రక్షణ సాంకేతికత, సరఫరా వ్యవస్థలు, సముద్ర భద్రత రంగాల్లో భారత్‌తో అమెరికా సహకారాన్ని మరింత విస్తరించాలని సిఫారసు చేసింది.

తాజ్‌మహల్ సందర్శనకు పాక్ మంత్రికి గ్రీన్‌సిగ్నల్!

ముసాదిక్ మాలిక్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి

నిజాముద్దీన్ దర్గా సందర్శనకు మాత్రం నిరాకరణ



న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థాన్ వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌కు ఆగ్రాలోని చారిత్రక తాజ్‌మహల్‌ను సందర్శించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే ఢిల్లీలోని ప్రసిద్ధ నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు మాత్రం అనుమతి నిరాకరించింది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాగరికతల సంభాషణల సదస్సులో పాల్గొనేందుకు మాలిక్ భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా తాజ్‌మహల్, నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు ఆయన తొలుత అనుమతి కోరగా కేంద్రం నిరాకరించింది. తాజాగా తాజ్‌మహల్‌తోపాటు హుమాయున్ సమాధి, ఢిల్లీ హాట్ సహా పలు చారిత్రక ప్రాంతాల సందర్శనకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో మాలిక్ నేతృత్వంలోని పాకిస్థాన్ బృందం ఆయా ప్రాంతాలను సందర్శించనుంది. గతంలో సింధూ జలాల ఒప్పందంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముసాదిక్ మాలిక్ భారత్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గత మూడేళ్లలో భారత్‌లో పర్యటిస్తున్న తొలి పాకిస్థాన్ మంత్రిగా ఆయన నిలిచారు. శుక్రవారం ఎస్‌సీఓ సదస్సు ప్రారంభమైన అనంతరం మీడియాతో మాట్లాడిన మాలిక్.. శాంతి, భద్రతను పెంపొందించేందుకు చేపట్టే అన్ని ప్రయత్నాలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య భవిష్యత్తులో పరస్పర పర్యటనలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని మాలిక్ అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ శాంతి, సహకారం కోసం సభ్య దేశాలన్నీ సమష్టిగా కృషి చేయాలని కోరారు. అయితే పాక్ మంత్రికి కొన్ని చారిత్రక ప్రాంతాల సందర్శనకు అనుమతి ఇచ్చి, నిజాముద్దీన్ దర్గాకు నిరాకరించడం చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయానికి సంబంధించిన కారణాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది.

రాహుల్ వ్యాఖ్యలకు కిరణ్ రిజిజు కౌంటర్..

1962 చైనా యుద్ధంపై క్షమాపణ చెబుతారా?

దేశాన్ని పేదరికంలో ఎందుకు ఉంచారు?

భారత్ ప్రతిష్ఠను ఎందుకు తగ్గించారు?

మోదీని 'రాజీ పడిన ప్రధాని' అన్న రాహుల్



న్యూ ఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఘాటుగా బదులిచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంలో భారత్‌కు ప్రాతినిధ్యం లేకపోవడంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సమాధానం చెప్పాల్సిన నాలుగు ప్రశ్నలను సంధించారు. శనివారం ఎక్స్ వేదికగా స్పందించిన రిజిజు.. 1962లో చైనా చేతిలో భారత్ ఎదుర్కొన్న పరాజయానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా అని ప్రశ్నించారు. చైనా ఆక్రమణకు గురైన ప్రాంతంలో తన గ్రామం కూడా ఉందని పేర్కొన్నారు. దేశాన్ని ఇన్నేళ్లపాటు పేదరికంలో ఎందుకు ఉంచారని, భారత్‌ను 'పాములు ఆడించే దేశం'గా ప్రపంచానికి ఎందుకు పరిచయం చేశారని నిలదీశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ వృద్ధి రేటు'గా అభివర్ణిస్తూ అభివృద్ధిని తక్కువ చేసి చూపించడంపై కూడా కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చైనాలో జరిగిన ఏపీఈసీ సదస్సు సందర్భంగా ట్రంప్, షీ జిన్‌పింగ్, పుతిన్ మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశంపై రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే భారత ప్రధానమంత్రి కూడా ఆ సమావేశంలో పాల్గొనేవారని వ్యాఖ్యానించారు. 'రాజీ పడిన ప్రధానమంత్రి ఎప్పటికీ ఆ సమావేశంలో కూర్చోలేరు' అంటూ మోదీని ఉద్దేశించి ఎక్స్‌లో పోస్టు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన రిజిజు.. భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీ మానుకోవాలని సూచించారు. దేశంలో ఉన్నా, విదేశీ పర్యటనల్లో ఉన్నా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. విదేశాల్లోని భారత్ వ్యతిరేక శక్తులతో రాహుల్ కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. భారత ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని, దేశ నాగరికత, సంప్రదాయాలు, రాజ్యాంగాన్ని బలహీనపరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలతో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. అంతర్జాతీయ పరిణామాలపై రాహుల్‌కు అవగాహన లేదంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. మరోవైపు, చైనాలో జరిగిన సమావేశంలో ట్రంప్‌కు రాహుల్ పానీయాలు అందిస్తున్నట్లుగా రూపొందించిన ఏఐ చిత్రాన్ని బీజేపీ సోషల్ మీడియాలో పంచుకుంది. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఈ చిత్రాన్ని ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'కుచ్ ఐసే' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నవ్వుతున్న, ఫైర్ ఎమోజీలను కూడా జత చేశారు.



వైభవంగా బంగారు గరుడసేవ

చిలుక ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

శ్రీ రంగనాథునికి తులసి కల్యాణం..పేట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు, నవంబర్ 21 (సమయం న్యూస్) : చిలుక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారికి తిరుమంజనం జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు బంగారు గరుడసేవ పేట ఉత్సవంలో భాగంగా స్వామివారు ఉత్తరాది మఠం (శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం) వద్దకు వేంచేశారు. అక్కడ శ్రీ రంగనాథ స్వామి వారికి, శ్రీ తులసి అమ్మవారికి తులసి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి పేట ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా దివంగత వేమగుంట రాఘవేంద్రరావు కుమారులు వ్యవహరించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ లెక్కల వెంకటరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు దూబిశెట్టి కల్యాణి, బొద్దుకూరు వెంకటలక్ష్మి, కొత్త వెంకట సుబ్రహ్మణ్యం, జూటూరు మహేష్ కుమార్ శర్మ, వీరెపల్లి పద్మజ, అద్దంకి చంద్రశేఖర్, తుమ్మకూరు రాజమోహన్, తలపుల ఉమామహేశ్వరి, బాసికల చిరంజీవి, దోర్నాల రాధిక, ఎక్స్‌ఒఅఫీషియో సభ్యుడు ఈ. దొరస్వామి, దేవస్థాన అర్చకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 12 కేసులు పరిష్కారం

ఏపీ హైకోర్టులో రెండు బెంచీల విచారణ

రూ.22.95 లక్షల పరిహారం అందజేత

సమయం, ఖర్చు ఆదా అవుతాయన్న అధికారులు



అమరావతి, నవంబర్ 21 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రాంగణంలో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్ఎల్ఆర్సీ), నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఎన్ఐ యాక్ట్)కు సంబంధించిన కేసులను పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక లోక్‌అదాలత్‌ను ఏర్పాటు చేశారు. హైకోర్టులో ఏర్పాటు చేసిన రెండు బెంచీల ఆధ్వర్యంలో కేసుల విచారణ చేపట్టారు. న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, కక్షిదారులు, సిబ్బంది సహకారంతో మొత్తం 12 కేసులు పరిష్కరించగా, రూ.22,95,000 సొమ్మును పరిహారంగా అందజేశారు. ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, కక్షిదారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని వారు అభినందించారు.

పాదచారుల భద్రతకే ప్రాధాన్యం

నడిచే హక్కు జీవించే హక్కులో భాగమే

హైదరాబాద్‌లో 120 ప్రాధాన్య కారిడార్లు

2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లకు సూచన



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్) : పట్టణ రవాణాలో వాహనాల వేగం కంటే పాదచారుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సెషన్ఉ17లో వక్తలు సూచించారు. నడిచే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ఉ21లోని జీవించే హక్కులో భాగమని సుప్రీంకోర్టు తీర్పులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. గుజరాత్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌లో పాదచారుల కోసం చేపట్టిన సేఫ్ కారిడార్లు, ఫుట్‌పాత్‌లు, మెట్రోఉఎంఎంటీఎస్ అనుసంధాన మార్గాలు, సంపూర్ణ వీధుల అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. హైదరాబాద్‌లో 120 ప్రాధాన్య కారిడార్లను గుర్తించినట్లు తెలిపారు. వీధుల రూపకల్పనలో భద్రత, నిరంతరత, సౌకర్యం, రక్షణ, గౌరవం అనే ఐదు సూత్రాలను పాటించాలని వక్తలు సూచించారు. ఫుట్‌పాత్‌లు కనీసం 2 మీటర్ల వెడల్పుతో, అడ్డంకులు లేకుండా ఉండాలని పేర్కొన్నారు. పాదచారులకు సురక్షితమైన, అందరికీ అందుబాటులో ఉండే పట్టణ రవాణా వ్యవస్థ అవసరమని సెషన్ చైర్ తెలిపారు.

యువత ఆలోచనలకు హద్దుల్లేవు

- **దేశ అభివృద్ధి, ఆవిష్కరణల్లో ఐఐటీ ఖరగ్‌పూర్‌ది కీలక పాత్ర**
- **ప్రైవేటుకు అంతరిక్ష రంగంతో యువతకు కొత్త అవకాశాలు**
- **2047 వికసిత భారత్‌లో యువతదే ప్రధాన భూమిక**
- **ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ**



కోల్‌కతా, నవంబర్ 21 (సమయం న్యూస్) : దేశాలు తమ ఆలోచనలకు ఉన్న హద్దులను అధిగమించినప్పుడే పూర్తి సామర్థ్యాన్ని చాటుకోగలవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'బ్రేక్ ది లిమిట్స్, అన్‌లాక్ ది పాసిబిలిటీస్' అనే స్ఫూర్తితో భారత్ ముందుకు సాగుతోందని, యువత ఆలోచనలకు ఎలాంటి హద్దులు లేవని ఆయన పేర్కొన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ 75వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. దేశ అభివృద్ధి, ఆవిష్కరణల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల అనుభవం కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో నిర్బంధ శిబిరంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఈ సంస్థ, నేడు దేశ స్వయం సమృద్ధికి అవసరమైన యువ ప్రతిభను తీర్చిదిద్దుతోందని కొనియాడారు. ఇంజినీరింగ్, అంతరిక్షం, అణుశక్తి, సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్ రంగాల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థులు విశేష సేవలు అందించారని ఆయన గుర్తుచేశారు.

అంతరిక్ష, సెమీకండక్టర్ రంగాల్లో అసాధ్యం సుసాధ్యం

సెమీకండక్టర్ మిషన్, అంతరిక్ష రంగంలో చేపట్టిన సంస్కరణలను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో అసాధ్యంగా భావించిన అనేక అంశాలను భారత్ ఇప్పుడు సాకారం చేస్తోందని చెప్పారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించేందుకే అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు సంస్థలకు తెరిచామని వెల్లడించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి, స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన వంటి యువ పారిశ్రామికవేత్తలు భారత అంతరిక్ష రంగానికి కొత్త దిశను చూపుతున్నారని ఆయన ప్రశంసించారు.

'నేషన్ ఫస్ట్' స్ఫూర్తితో 2047 లక్ష్యం వైపు..

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో నేటి యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని ప్రధాని మోదీ సూచించారు. ప్రతి ఒక్కరూ 'నేషన్ ఫస్ట్' భావనతో ముందుకు సాగాలని, దేశంలోని ప్రధాన సవాళ్ల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ 100వ వార్షికోత్సవాన్ని అభివృద్ధి చెందిన భారత్‌లో జరుపుకునేలా శ్రమించాలని కోరిన ప్రధాని.. స్వామి వివేకానంద సందేశమైన 'లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి' అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని యువతకు దిశానిర్దేశం చేశారు.

దేశంలో 32 నకిలీ యూనివర్సిటీలు

- **విద్యార్థులు, తల్లిదండ్రులకు యూజీసీ హెచ్చరిక**
- **ఢిల్లీలో 12, ఏపీలో రెండు సంస్థల గుర్తింపు**
- **అధికారిక జాబితాలో లేని తెలంగాణ సంస్థలు**
- **గుర్తింపు పరిశీలించాకే ప్రవేశాలు పొందాలని సూచన**



న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్) : దేశవ్యాప్తంగా గుర్తింపు లేని నకిలీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు తీసుకుని మోసపోవద్దని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విద్యార్థులు, తల్లిదండ్రులు, సంరక్షకులను హెచ్చరించింది. 2026 ఫిబ్రవరి నాటి జాబితా ఆధారంగా ఈ నెల 17న యూజీసీ తాజా హెచ్చరికను జారీ చేసింది. దీని ప్రకారం దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 32 నకిలీ విశ్వవిద్యాలయాలను గుర్తించింది. ఇందులో అత్యధికంగా ఢిల్లీలో 12, ఉత్తరప్రదేశ్‌లో నాలుగు సంస్థలు ఉండగా.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లో రెండేసి చొప్పున, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, రాజస్థాన్‌లలో ఒక్కో సంస్థ చొప్పున ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఈ 32 సంస్థల అధికారిక జాబితాలో తెలంగాణకు చెందిన ఏ సంస్థా లేకపోవడం గమనార్హం. ఏదైనా విద్యాసంస్థలో ప్రవేశం తీసుకునే ముందు దానికి చట్టబద్ధమైన గుర్తింపు ఉందా, సంబంధిత కోర్సులు నిర్వహించేందుకు అనుమతి ఉందా, డిగ్రీలు ప్రదానం చేసే అధికారం ఉందా, అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా అనే అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని యూజీసీ స్పష్టం చేసింది. కేవలం ప్రకటనలు, వెబ్‌సైట్లు లేదా సోషల్ మీడియా ప్రచారాలను మాత్రమే నమ్మవద్దని సూచించింది.

రాష్ట్రాల వారీగా నకిలీ యూనివర్సిటీలివే..

ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా ఈ జాబితాలో ఉన్నాయి. ఢిల్లీలో మౌంటెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ, వరల్డ్ పీస్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ (డబ్ల్యూపీయూఎన్‌యూ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ (ఏఐఐపీహెచ్ఎస్), కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్, యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ, వొకేషనల్ యూనివర్సిటీ, ఏడీఆర్ఉసెంట్రిక్ జురిడికల్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్ఉ ఎంప్లాయ్‌మెంట్, ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ (స్పిరిచువల్ యూనివర్సిటీ)లను నకిలీవిగా గుర్తించింది.

ఉత్తరప్రదేశ్‌లో గాంధీ హిందీ విద్యాపీఠ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ (ఓపెన్ యూనివర్సిటీ), భారతీయ శిక్షా పరిషత్, మహామాయ టెక్నికల్ యూనివర్సిటీ ఉన్నాయి. కర్ణాటకలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ, సర్వ భారతీయ శిక్షా పీఠ్; కేరళలో ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్ (ఐఐయూపీఎం), సెయింట్ జాన్స్ యూనివర్సిటీ; మహారాష్ట్రలో రాజా అరబిక్ యూనివర్సిటీ, నేషనల్ బ్యాక్‌వర్డ్ కృషి విద్యాపీఠ్; పుదుచ్చేరిలో ఉషా లచ్చుమనన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్; పశ్చిమ బెంగాల్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్‌లను చేర్చింది. అలాగే అరుణాచల్ ప్రదేశ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, హర్యానాలో మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ, జార్ఖండ్‌లో దక్ష యూనివర్సిటీ, రాజస్థాన్‌లో రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ నకిలీ విశ్వవిద్యాలయాల జాబితాలో ఉన్నట్లు యూజీసీ వెల్లడించింది.

లడఖ్‌లో తొలిసారి స్థానిక పోరు

కేంద్రపాలిత ప్రాంతమయ్యాక ఇదే ప్రథమం

లేహ్, నవంబర్ 21 (సమయం న్యూస్) : కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడిన తర్వాత లడఖ్‌లో తొలిసారిగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. స్థానిక పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం ఈ ఎన్నికల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మణిపూర్‌లో కల్తీ మద్యం కలకలం

ఇంఫాల్, నవంబర్ 21 (సమయం న్యూస్) : మణిపూర్‌లో కల్తీ మద్యం సేవించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇంఫాల్‌లో కల్తీ మద్యం సేవించినట్లు అనుమానిస్తున్న ఘటనలో 11 మంది మృతి చెందగా, 300 మందికి పైగా అస్వస్థతకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. సమగ్ర విచారణకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కల్తీ మద్యం సరఫరా వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

2027లో తొలి బుల్లెట్ రైలు

సూరత్ఉవాపి మధ్య తొలి దశ సేవలు.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత్‌లో తొలి బుల్లెట్ రైలు సేవలు 2027లో ప్రారంభం కానున్నాయి. ముంబైఉఅహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో సూరత్ఉవాపి మధ్య రైలు సేవలను ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశంలో హైస్పీడ్ రైలు రవాణాకు ఇది కీలక ముందడుగు అని రైల్వే శాఖ పేర్కొంది.

24న ఇంద్రకీలాద్రిపై కార్తీక దీపోత్సవం

8 సెక్టార్లుగా ఆలయంలో అలంకరణ

ఇంద్రకీలాద్రి, నవంబర్ 21 (సమయం న్యూస్): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 24న ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఆలయ పరిధిని 8 సెక్టార్లుగా విభజించి దీపాలు, పూలతో అలంకరిస్తున్నారు. ఓం, స్వస్తిక్, శివలింగం, శ్రీచక్రం ఆకృతులతో ప్రత్యేక రంగవల్లులు ఏర్పాటు చేస్తున్నారు. దీపాలంకరణలో 700 మందికి పైగా సేవాదారులు పాల్గొననున్నారు. రాత్రి శివాలయంలో జ్వాలా తోరణం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు.



సంక్షేమం, వృద్ధి రెండు చక్రాలు

కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ వ్యాఖ్య

గాంధీనగర్‌లో చింతన్ శివిర్ ప్రారంభం

101 కోట్లకు చేరిన సామాజిక భద్రత

గాంధీనగర్, నవంబర్ 21 (సమయం న్యూస్) : కార్మికుల సంక్షేమం, పారిశ్రామిక వృద్ధి దేశ ప్రగతికి రెండు చక్రాల వంటివని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. గాంధీనగర్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్మిక, ఉపాధి మంత్రుల రెండు రోజుల చింతన్ శివిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్మిక చట్టాల అమలు 'వికసిత్ భారత్' దిశగా కీలక ముందడుగు అని పేర్కొన్నారు. దేశంలో సామాజిక భద్రత పరిధి 2014లో 25 కోట్ల నుంచి 2026 నాటికి 101 కోట్లకు పెరిగిందని వివరించారు. కార్మిక సంక్షేమంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఇఫీలో 'సీఎంఓటీ' ప్రారంభం

100 మంది యువ ప్రతిభావంతుల హాజరు

48 గంటల ఫిల్మ్ మేకింగ్ ఛాలెంజ్



మూలాల నుంచి కథలు తీయాలని పిలుపు

గోవా, నవంబర్ 21 (సమయం న్యూస్) : 57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో (ఇఫీ) భాగంగా 'క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' (సీఎంఓటీ) ఆరో ఎడిషన్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 100 మంది యువ సినీ ప్రతిభావంతులు పాల్గొంటున్నారు. 'రూట్స్ అండ్ వింగ్స్' ఇతివృత్తంతో ఇక్కడ 48 గంటల ఫిల్మ్ మేకింగ్ ఛాలెంజ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదు బృందాలు లఘు చిత్రాలను రూపొందించనున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి చంచల్ కుమార్ మాట్లాడుతూ.. యువత తమ సంస్కృతి, మూలాల నుంచి స్ఫూర్తి పొంది ప్రపంచస్థాయి కథలను తెరకెక్కించాలని పిలుపునిచ్చారు.

భారతీయ సినిమాకు వైవిధ్యమే బలం

358 ఎంట్రీల నుంచి 20 చిత్రాల ఎంపిక

గోవా, నవంబర్ 21 (సమయం న్యూస్) : భారతీయ సినిమా వైవిధ్యం, సంస్కృతి, జీవన అనుభవాలను ప్రపంచానికి నిజమైన రూపంలో చాటడమే తమ ప్రధాన లక్ష్యమని 57వ అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ2026) ఇండియన్ పనోరమా నాన్ ఫీచర్ ఫిల్మ్ జ్యూరీ చైర్‌పర్సన్ హిమాంశు శేఖర్ ఖటువా తెలిపారు. ఇఫీలో నిర్వహించిన మీడియా సమావేశంలో జ్యూరీ సభ్యులు చిత్రాల ఎంపిక ప్రక్రియ, కథన శక్తి, సాంకేతిక పరిణామాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మొత్తం 358 ఎంట్రీల నుంచి పలు దశల్లో కఠినమైన పరిశీలన అనంతరం 20 చిత్రాలను ఇండియన్ పనోరమాకు ఎంపిక చేసినట్లు ఖటువా వెల్లడించారు. 'స్టోరీస్ విత్‌ఔట్ బోర్డర్స్' (సరిహద్దులు లేని కథలు) అనే ఇఫీ థీమ్‌కు అనుగుణంగా దేశంలోని వివిధ ప్రాంతాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, ప్రజల జీవన అనుభవాలను ప్రతిబింబించే చిత్రాలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. చిత్రాలను ఒక్కో అంశం ఆధారంగా కాకుండా సంపూర్ణంగా పరిశీలించామని, ప్రధాన స్రవంతి ధోరణులకు మాత్రమే పరిమితం కాకుండా విభిన్న కథనాలు, ప్రత్యేక దృక్కోణాలను పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు.

ఏఐపై మానవ సృజనాత్మకతదే పైచేయి

సినీ నిర్మాణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం పెరుగుతున్నప్పటికీ, మానవ ఊహాశక్తి, భావోద్వేగం, సృజనాత్మక దృక్పథానికి ప్రత్యామ్నాయం లేదని ఖటువా స్పష్టం చేశారు. ఏఐ ఒక సృజనాత్మక సాధనంగా ఉపయోగపడవచ్చని, అయితే అది ఎప్పటికీ మానవ మేధస్సును భర్తీ చేయకూడదని పేర్కొన్నారు.

జ్యూరీ సభ్యురాలు ఆర్తి పటేల్ మాట్లాడుతూ.. భిన్నమైన అంశాలు, కథలు, దృక్కోణాలతో వచ్చిన చిత్రాలను పరిశీలించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సినిమా భాష, ప్రాంతం, సంస్కృతి వంటి సరిహద్దులను దాటి ప్రజలను కలిపే విశ్వభాషగా నిలుస్తోందని చెప్పారు. ఎంపికైన చిత్రాలు భారతదేశంలోని విభిన్న సామాజిక వాస్తవికతలు, సాంస్కృతిక వైవిధ్యానికి అద్దం పడుతున్నాయని అభిజీత్ అరవింద్ దాల్వీ పేర్కొన్నారు. 'స్టోరీస్ విత్‌ఔట్ బోర్డర్స్' థీమ్ ఎంతో అర్థవంతంగా ఉందని రాగిణి సోనా అభిప్రాయపడ్డారు. మంచి సినిమా కేవలం వినోదమే కాకుండా ఆలోచింపజేసి, దృక్పథాలను మార్చి, సమాజంలో సానుకూల మార్పుకు ప్రేరణనివ్వగలదని శివ్ సన్నీ అన్నారు. కాగా 57వ ఇఫీ నవంబర్ 20 నుంచి 28 వరకు గోవాలో జరుగుతోంది.



దిల్లీ మేళాలో తెలంగాణ సందడి

ప్రత్యేక ఆకర్షణగా ఇప్పపూల లడ్డూలు

గ్లోబల్ సమ్మిట్‌కు ఉచిత నమోదు

ఆకట్టుకుంటున్న చేనేత, గిరిజన ఉత్పత్తులు

దిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్) : పోచంపల్లి ఇక్కత్, గద్వాలఉనారాయణపేట చీరలు, వరంగల్ చేనేత తివాచీలు, కలంకారీ ఉత్పత్తులు, హైదరాబాద్ లక్క గాజులు, ముత్యాలు, గిరిజన ఆహార ఉత్పత్తులు దిల్లీలో జరుగుతున్న 45వ భారత అంతర్జాతీయ వాణిజ్య మేళా (ఐఐటీఎఫ్)లో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భారత్ మండపంలోని తెలంగాణ పవిలియన్‌లో చేనేత, హస్తకళలు, సంప్రదాయ ఆహార ఉత్పత్తులతో పాటు ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. వీటిలో ఇప్పపూల లడ్డూలు, చిరుధాన్యాల బిస్కెట్లు, సేంద్రియ అగరుబత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'వికాస్ ఔర్ విరాసత్' ఇతివృత్తంతో జరుగుతున్న ఈ మేళాలో 11 దేశాలు, 3,500 మందికి పైగా ప్రదర్శకులు పాల్గొంటున్నారు. ఈ వేదిక ద్వారా తెలంగాణ కళాకారులు, చేనేత కార్మికులు, స్వయం సహాయక సంఘాలకు కొనుగోలుదారులతో నేరుగా అనుసంధానమయ్యే అవకాశం లభిస్తోంది. ఈ వాణిజ్య మేళా నవంబర్ 27 వరకు కొనసాగుతుంది. మరోవైపు తెలంగాణ పవిలియన్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ఉ2026'కు సంబంధించిన నమోదు సదుపాయం కూడా కల్పించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే ఈ సదస్సుకు క్యూఆర్ కోడ్ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.







హైదరాబాద్‌లో మత్స్య దినోత్సవం





- **ఎన్ఎఫ్‌డీబీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**
- **దేశవ్యాప్తంగా ప్రతినిధులు, అధికారుల హాజరు**
- **యువత, మహిళల ఉపాధిపై ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్) : హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ఆధ్వర్యంలో, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని మత్స్య శాఖ సహకారంతో ప్రపంచ మత్స్య దినోత్సవంఉ2026 వేడుకలను నవంబర్ 21న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా మత్స్య రంగానికి చెందిన ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఏడాది ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ప్రకటించిన "మార్పు కోసం ప్రజలకు సాధికారత: మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో ముఖ్యంగా యువత, మహిళలకు గౌరవప్రదమైన ఉపాధిని ముందుకు తీసుకెళ్లడం" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మూడు ప్రసవాలు.. 26 జనన పత్రాలు!

రాయ్‌పూర్‌లో శిశు విక్రయ ముఠా గుట్టురట్టు

ఆసుపత్రి ఎండీ సహా ఆరుగురి అరెస్ట్

ఒక్కో శిశువుకు రూ.4-12 లక్షల వసూలు ఆరోపణ

అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌పై పోలీసుల దర్యాప్తు

రాయ్‌పూర్, నవంబర్ 21 (సమయం న్యూస్) : ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శిశువుల అక్రమ విక్రయం, అక్రమ దత్తతకు సంబంధించిన అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు గుర్తించారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 2026లో కేవలం మూడు ప్రసవాలు జరిగినట్లు రికార్డులు చూపుతుండగా, అదే ఆసుపత్రి పేరుతో 26 జనన ధ్రువపత్రాల కోసం పత్రాలు సమర్పించినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. ఒడిశాకు చెందిన ఓ మహిళ తన నవజాత శిశువును అప్పగించాల్సిందిగా తనపై ఒత్తిడి తెస్తున్నారని పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు తొలుత ముగ్గురు మహిళలను, అనంతరం ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ప్రస్తుతం మొత్తం ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు. పోలీసుల ఆరోపణల ప్రకారం.. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మహిళలు, అవివాహిత గర్భిణులను గుర్తించి ఆసుపత్రిలో ప్రసవాలు చేయించి, అనంతరం శిశువులను ఇతర రాష్ట్రాల్లోని దంపతులకు విక్రయించేందుకు ఈ ముఠా ప్రయత్నించేది. ఒక్కో శిశువుకు రూ.4 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అహ్మదాబాద్, ముంబై, చెన్నై తదితర నగరాలకు శిశువులను తరలించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఆసుపత్రి రికార్డులు, ఓపీ రిజిస్టర్, జనన ధ్రువపత్రాలకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాతో మరెంతమందికి సంబంధం ఉంది, గతంలో ఎంతమంది శిశువులను విక్రయించారు అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే ఇవన్నీ ప్రస్తుతం పోలీసుల దర్యాప్తులో ఉన్న ఆరోపణలు మాత్రమే కాగా, నిందితులపై నేరం కోర్టులో నిరూపితం కావాల్సి ఉంది.



అంతర్జాతీయ మార్కెట్‌లో మెప్మా సత్తా

19 ఆర్డర్లు.. రూ.1.28 కోట్ల ఒప్పందాలు

తిరుపతి ఆర్‌బీఎస్ఎంలో మహిళల ఘనత

కలంకారీ, హస్తకళలకు రూ.50 లక్షల ఆర్డర్లు

తిరుపతి, నవంబర్ 21 (సమయం న్యూస్) : తిరుపతిలో జరుగుతున్న రివర్స్ బయ్యర్స్ఉసెల్లర్స్ మీట్ (ఆర్‌బీఎస్ఎం)లో మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలు ఘన విజయం సాధించారు. అంతర్జాతీయ కొనుగోలుదారులతో నిర్వహించిన బీటూబీ సమావేశాల్లో 39 మంది మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొనగా, 18 మందికి 19 అంతర్జాతీయ ఆర్డర్లు లభించాయి. వీటి మొత్తం విలువ రూ.1.28 కోట్లు. కలంకారీ, హస్తకళలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వస్త్రాలు, దుస్తులు, వ్యవసాయ, ఆహార, వెదురు ఉత్పత్తులకు ఆర్డర్లు దక్కాయి. ఇందులో కలంకారీ, హస్తకళా ఉత్పత్తులకు రూ.50 లక్షలకు పైగా, ఆటోమొబైల్ విడిభాగాలకు రూ.23 లక్షలకు పైగా విలువైన ఆర్డర్లు రావడం విశేషం. మరికొందరు మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తుల నమూనాలను అంతర్జాతీయ కొనుగోలుదారులకు అందజేశారు. వీటిపై తదుపరి చర్చల ద్వారా మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంది. స్థానికంగా తయారవుతున్న మహిళల ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు ఆర్‌బీఎస్ఎం చక్కటి వేదికగా నిలిచిందని మెప్మా పేర్కొంది. మహిళా పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం అందించిన మెప్మా మిషన్ డైరెక్టర్, ఏఎండీ, ఎస్ఎంసీ, ఎస్ఎంఎంఉఎల్‌హెచ్‌లు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు, జిల్లా మెప్మా బృందాలతో పాటు అంతర్జాతీయ ఆర్డర్లు సాధించిన మహిళా పారిశ్రామికవేత్తలను మెప్మా అభినందించింది.





ఆ పరీక్షలు మహిళలపై తీవ్రమైన హింసే!

జన్యు పరీక్షల నిబంధనపై ఫ్రాన్స్ క్రీడల మంత్రి ఆగ్రహం

మహిళా అథ్లెట్ల హక్కులకు విఘాతమంటూ తీవ్ర అభ్యంతరం

2028 ఒలింపిక్స్‌కు ముందే నిబంధనలు సమీక్షించాలని డిమాండ్

జన్యు పరీక్షలను వ్యతిరేకించిన 60 శాతం ఫ్రెంచ్ టెన్నిస్ క్రీడాకారిణులు

పారిస్, నవంబర్ 21 (సమయం న్యూస్): మహిళా క్రీడాకారిణులకు జన్యు పరీక్షలను తప్పనిసరి చేసే నిబంధనలపై ఫ్రాన్స్ క్రీడల మంత్రి మరినా ఫెరారీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి పరీక్షలు మహిళలపై తీవ్రమైన హింసతో సమానమని, వారి హక్కులను కాలరాసే వివక్షపూరిత చర్యలని మండిపడ్డారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ముందే ఈ నిబంధనలను పునఃసమీక్షించాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)ని కోరారు. మహిళా క్రీడాకారిణుల అర్హత నిర్ధారణ పేరుతో జన్యు పరీక్షలు నిర్వహించడం మహిళా హక్కుల విషయంలో తిరోగమనమేనని వ్యాఖ్యానించారు. గత పారిస్ ఒలింపిక్స్‌లో అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ లింగ అర్హతపై వివాదం తలెత్తిన నేపథ్యంలో మహిళల విభాగంలో పోటీపడే అథ్లెట్ల అర్హత నిర్ధారణపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. ఈ క్రమంలో మహిళా క్రీడాకారిణులకు కెరీర్‌లో కనీసం ఒక్కసారైనా జన్యు పరీక్షలు నిర్వహించే విధానాన్ని పలు అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలు అమలు చేస్తున్నాయి. అయితే ఇలాంటి పరీక్షలను తప్పనిసరి చేయడంపై మహిళా అథ్లెట్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. "ఐఓసీ ఈ విషయంలో వెనక్కి తగ్గుతుందో లేదో చెప్పలేను. కానీ నిబంధనలను పునఃపరిశీలిస్తుందని ఆశిస్తున్నాను. ఇప్పటికే అనేక అంతర్జాతీయ సమాఖ్యలు జన్యు పరీక్షలను అమలు చేస్తున్నాయి. టెన్నిస్‌లోనూ ఈ పరీక్షలను తప్పనిసరి చేస్తున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన మహిళా టెన్నిస్ క్రీడాకారిణుల్లో 60 శాతం మంది వీటిని వ్యతిరేకించారు. ఇది మహిళల పట్ల స్పష్టమైన వివక్ష. వారి హక్కుల విషయంలో వెనుకడుగు వేయడమే" అని ఫెరారీ పేర్కొన్నారు. 2030 శీతాకాల ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించానని, మహిళా అథ్లెట్ల అభ్యంతరాలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. జన్యు పరీక్షల విషయంలో స్పష్టమైన విధానం లేకపోతే యువ క్రీడాకారిణులు క్రీడల్లోకి రావడంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని హెచ్చరించారు. మహిళల గౌరవం, హక్కులను కాపాడేలా అంతర్జాతీయ క్రీడా సంస్థలు నిర్ణయాలు తీసుకోవాలని ఫెరారీ కోరారు.



ఉద్యోగులకు కావ్య మారన్ సర్‌ప్రైజ్ గిఫ్ట్..

బంగారు ఉంగరాలు, చాక్లెట్లతో పెళ్లి కానుక!

చెన్నై, నవంబర్ 21 (సమయం న్యూస్): సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ, సన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కావ్య మారన్ పేరు సామాజిక మాధ్యమాల్లో మరోసారి చర్చనీయాంశమైంది. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహం జరిగినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సన్ గ్రూప్ ఉద్యోగులకు ప్రత్యేక కానుకలు పంపించినట్లు వీడియోలు వైరల్ అవుతున్నాయి. కానుకల పెట్టెల్లో పెళ్లి ఆహ్వాన పత్రికలు, చాక్లెట్లతోపాటు బంగారు ఉంగరాలు ఉన్నట్లు నెటిజన్లు పేర్కొంటున్నారు. అయితే ఈ కానుకలు కావ్య మారన్ వివాహానికి సంబంధించినవేనని స్వతంత్రంగా ధ్రువీకరించే సమాచారం అందుబాటులో లేదు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న వీడియోల్లో ఉద్యోగులు కానుకల పెట్టెలను తెరిచి చూస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. బంగారు నాణేలు ఉంటాయని భావించగా ఉంగరాలు కనిపించడంతో ఆశ్చర్యపోయినట్లు ఓ ఉద్యోగి వ్యాఖ్యానించిన వీడియో కూడా వైరల్ అవుతోంది. ఆహ్వాన పత్రికలో నవంబర్ 25న ప్రత్యేక విందు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఆ కార్యక్రమం సన్ గ్రూప్ ఉద్యోగుల కోసమే నిర్వహిస్తున్నారా అనే విషయంపై స్పష్టత లేదు. మరోవైపు కావ్య మారన్, అనిరుధ్ రవిచందర్ నవంబర్ 11న గ్రీస్‌లో ఆత్మగౌరవ వివాహ పద్ధతిలో ఒక్కటయ్యారని, నవంబర్ 21న చెన్నైలో వివాహ విందు నిర్వహించనున్నారని సామాజిక మాధ్యమాల్లో కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఈ వివాహం, కానుకలు, విందు కార్యక్రమాలకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడిందో లేదో నిర్ధారణ కావాల్సి ఉంది. దీంతో వైరల్ వీడియోల వెనుక వాస్తవాలపై ఆసక్తి నెలకొంది.

94 ఏళ్ల భారత టెస్ట్ చరిత్రలో తొలిసారి

విదేశీ గడ్డపై టీమిండియా అరుదైన రికార్డు!

న్యూజిలాండ్‌తో వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించారు. ఒకే ఇన్నింగ్స్‌లో భారత టాప్-5 బ్యాటర్లు అందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించి, విదేశీ గడ్డపై ఈ ఘనత సాధించిన తొలి భారత జట్టుగా నిలిచారు.



వెల్లింగ్‌టన్, నవంబర్ 21 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా బ్యాటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో భారత టాప్-5 బ్యాటర్లు అందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించి అరుదైన ఘనతను అందుకున్నారు. భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో టాప్-5 బ్యాటర్లు అర్ధశతకాలు చేయడం ఇది ఐదోసారి కాగా, విదేశీ గడ్డపై ఈ ఘనత సాధించడం మాత్రం ఇదే తొలిసారి. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసి 118 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఇంకా ఆరు వికెట్లు చేతిలో ఉండటంతో నాలుగో రోజు మరింత భారీ స్కోరు సాధించాలని భారత్ భావిస్తోంది.

టాప్-5 బ్యాటర్ల అద్భుత ప్రదర్శన..

భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 85 పరుగులతో మంచి ఆరంభాన్ని అందించగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ 136 పరుగులతో అద్భుత శతకం సాధించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ 80 పరుగులతో రాణించి, రాహుల్‌తో కలిసి రెండో వికెట్‌కు 165 పరుగులు జోడించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 146 బంతుల్లో 98 పరుగులు చేసి సెంచరీకి కేవలం రెండు పరుగుల దూరంలో వెనుదిరిగాడు. చివర్లో రిషభ్ పంత్ దూకుడుగా ఆడి 62 బంతుల్లో 55 పరుగులతో అజేయంగా నిలవడంతో భారత టాప్-5 బ్యాటర్లందరూ అర్ధశతకాలు పూర్తి చేశారు. గతంలో స్వదేశంలో జరిగిన 1998 కోల్‌కతా (ఆస్ట్రేలియాపై), 1999 మొహాలీ (న్యూజిలాండ్‌పై), 2009 బ్రాబోర్న్ (శ్రీలంకపై), 2024 ధర్మశాల (ఇంగ్లండ్‌పై) టెస్టుల్లో మాత్రమే ఈ ఘనత నమోదు కాగా, విదేశీ గడ్డపై ఇప్పుడు తొలిసారి సాధ్యమైంది.

కేఎల్ రాహుల్ ఖాతాలో అరుదైన రికార్డులు

ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ 290 బంతుల్లో 136 పరుగులు చేసి తన టెస్ట్ కెరీర్‌లో 13వ సెంచరీని నమోదు చేశాడు. తద్వారా న్యూజిలాండ్ గడ్డపై తొలి టెస్ట్ ఇన్నింగ్స్‌లోనే శతకం సాధించిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు (1976లో సునీల్ గవాస్కర్ 116, సురీందర్ అమర్‌నాథ్ 124 పరుగులతో ఈ ఘనత సాధించారు). అంతేకాకుండా దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలన్నింటిలోనూ టెస్ట్ సెంచరీలు చేసిన ఐదో భారత క్రికెటర్‌గా (గతంలో మహమ్మద్ అజారుద్దీన్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ), అన్ని సేన దేశాల్లో సెంచరీలు చేసిన తొలి భారత ఓపెనర్‌గా కూడా రాహుల్ రికార్డు సృష్టించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రిషభ్ పంత్ (55), అన్షుల్ కాంబోజ్ (0) క్రీజులో ఉన్నారు. నాలుగో రోజు ఆటలో భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని కివీస్‌పై ఒత్తిడి పెంచాలని చూస్తోంది.



టీమ్‌ఇండియాకు అన్యాయం..

అందుకే పాకిస్థాన్‌కు ట్రోఫీ దక్కిందా?

వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే అంధుల ఆసియా కప్ ఫైనల్ రద్దు కాగా, రన్‌రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించడంపై భారత జట్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టోర్నమెంట్ నిబంధనల్లో లేని రూల్‌ను తెరపైకి తెచ్చి, కీలక పదవుల్లో ఉన్న పాకిస్థాన్ సభ్యులు తమ అధికారాలను దుర్వినియోగం చేశారని టీమ్‌ఇండియా కెప్టెన్ దుర్గారావు, జట్టు మేనేజర్ ధీరజ్ సెక్వేరా ఆరోపించారు.



ఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): వర్షం కారణంగా ఒక్క బంతీ పడకుండానే అంధుల ఆసియా కప్ ఫైనల్ రద్దు కాగా, రన్‌రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించడంపై టీమ్‌ఇండియా కెప్టెన్ దుర్గారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది తమకు జరిగిన అన్యాయమని, విజేతను నిర్ణయించడానికి నెట్ రన్‌రేట్‌ను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నిస్తే నిర్వాహకుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉదయం 10 గంటల నుంచే తాము మైదానంలో ఉన్నామని, వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండగా సాయంత్రం 4.15 గంటలకు కట్‌ఆఫ్ టైమ్ ఉంటుందని అంపైర్లు చెప్పినట్లు తెలిపాడు. కానీ, సాయంత్రం 4 గంటలకే రన్ రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటిస్తున్నామని చెప్పడం భారత క్రీడాకారులను, అధికారులను దిగ్భ్రాంతికి గురిచేసిందని దుర్గారావు వివరించాడు. అసలు మ్యాచ్ మొదలుకాకముందే రన్ రేట్ ఆధారంగా విజేతను ప్రకటించే విధానం అంధుల క్రికెట్ నిబంధనల్లో ఎక్కడా లేదని, ఆసియా కప్ వంటి పెద్ద టోర్నీలో నిబంధనలను పరిశీలించకుండా నిర్ణయం తీసుకోవడంపై మ్యాచ్ రిఫరీని ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని పేర్కొన్నాడు.

పాక్ సభ్యుల అధికార దుర్వినియోగమే కారణమా?:

ఈ వివాదంపై భారత జట్టు మేనేజర్ ధీరజ్ సెక్వేరా స్పందిస్తూ.. ఇది వరల్డ్ బ్లైండ్ క్రికెట్ కౌన్సిల్ టెక్నికల్ టీమ్ వైఫల్యమేనని స్పష్టం చేశారు. టెక్నికల్ డైరెక్టర్ తాహీర్ భట్ పాకిస్థాన్ టీమ్‌కు ఫిజియోగా వ్యవహరిస్తున్నారని, అలాగే కౌన్సిల్ ప్రెసిడెంట్ సయ్యద్ సుల్తాన్ షా కూడా పాకిస్థాన్ బ్లైండ్ క్రికెట్ జట్టు ఛైర్మన్‌గా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. కీలక పదవుల్లో ఉన్న పాక్ సభ్యులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. వరల్డ్ బ్లైండ్ క్రికెట్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్‌గా ఉన్న రజనీశ్ హెన్రీ స్వయంగా అక్కడే ఉండి ఈ నిబంధన పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారని, ఆస్ట్రేలియాలో ఉన్న గ్లోబల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రేమండ్ మాక్స్‌లీను సంప్రదించగా ఆయన కూడా ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడినట్లు ధీరజ్ సెక్వేరా వెల్లడించారు.

సిరాజ్ అంశంపై మనం మాట్లాడొద్దు

సెలక్టర్ల నిర్ణయాన్ని గౌరవించాలి: కపిల్ దేవ్

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు కివీస్‌తో తొలి టెస్టు తుది జట్టులో చోటు కల్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై పలువురు మాజీలు విశ్లేషణలు, అసంతృప్తి వ్యక్తం చేయగా, ఓ కాంగ్రెస్ ఎంపీ చేసిన మతపరమైన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దానికి భాజపా కూడా ఘాటుగా కౌంటర్ ఇచ్చింది. తాజాగా ఓ కార్యక్రమంలో కపిల్ దేవ్ ఎదుట ఈ అంశం ప్రస్తావనకు రాగా.. ఇలాంటి వాటిపై ఎవరూ మాట్లాడొద్దని ఆయన స్పష్టం చేశారు. సిరాజ్‌ను ఎందుకు పక్కన పెట్టారనేది సెలక్టర్లను అడగాలని, అది చెప్పడానికి తాను ఎవరినని ప్రశ్నించారు. ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై కామెంట్లు చేయకూడదని, జట్టు ఎంపిక కోసం ఓ వ్యవస్థ ఉందని, బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తులే స్పష్టమైన సమాధానం ఇస్తారని కపిల్ తెలిపారు. ప్రతి ఒక్కరినీ సంతోషపరచడం సాధ్యం కాదని, వ్యవస్థను విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. భారత క్రికెట్ బాగా సాగుతోందని, తనకు కూడా సిరాజ్ అంటే ఇష్టమే అయినప్పటికీ సెలక్టర్లు, మేనేజ్‌మెంట్, కెప్టెన్ జట్టు కూర్పు కోసం అవసరమైన మార్పులు చేసుకుంటారని, అందులో వ్యక్తిగత ఇష్టాయిష్టాలు విషయమే కాదని వివరించారు.



సచిన్‌కూ తప్పలేదు..

ప్రస్తుత ఫామ్‌కే ప్రాధాన్యత: కైఫ్

జట్టులో మార్పులు చేయడం అత్యంత సహజమని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ పేర్కొన్నారు. ఒకటీ లేదా రెండు మ్యాచుల్లో విఫలమైతే జట్టు నుంచి పక్కన పెడతారని, సచిన్ తెందుల్కర్‌కూ ఇలాంటి పరిస్థితులు తప్పలేదని గుర్తు చేశారు. కుల్‌దీప్, అశ్విన్, రోహిత్, విరాట్, సూర్య, షమీ వంటి ఎంతోమంది జాబితాలో ఉన్నారని తెలిపారు. ఇక్కడ సీనియర్లా కాదా అనేది కాకుండా, సీనియర్ అయినంత మాత్రాన ఇప్పుడు ఏం చేస్తున్నామనేదే ముఖ్యమని స్పష్టం చేశారు. గత సిరీస్‌లో ఆటగాళ్లు ఎలా ఆడారనేదానిపైనే మేనేజ్‌మెంట్ దృష్టి పెడుతుందని, శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో సిరాజ్ గొప్ప ప్రదర్శన చేయలేకపోయాడని మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డారు.





నా జీవితంలోని ఆనందం నువ్వే

అర్హకు బన్నీ ఎమోషనల్ విషెస్!,, గారాలపట్టి పుట్టినరోజున అల్లు అర్జున్ ప్రత్యేక పోస్ట్

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన గారాలపట్టి అల్లు అర్హ పుట్టినరోజు సందర్భంగా భావోద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. కుమార్తెతో సరదాగా గడిపిన ఓ అందమైన క్షణాన్ని అభిమానులతో పంచుకుంటూ ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అర్హతో కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేసిన బన్నీ.. "నా జీవితంలోని ఆనందానికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ప్రేమను వ్యక్తం చేశారు. చిన్న సందేశంతోనే కుమార్తెపై తనకున్న అపారమైన ప్రేమను చాటుకున్నారు. అల్లు అర్జున్ పోస్ట్ చేసిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటోంది. కొద్దిసేపట్లోనే మూడు లక్షలకు పైగా లైకులు వచ్చినట్లు సమాచారం. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు అల్లు అర్హకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ పిల్లలతో గడిపే మధుర క్షణాలను అభిమానులతో పంచుకోవడం బన్నీకి అలవాటు. తాజాగా కుమార్తె పుట్టినరోజున చేసిన పోస్ట్ మరోసారి అభిమానుల మనసులు గెలుచుకుంది.

'ఒసేయ్ రాములమ్మ' అనగానే భయమేసింది!

పాట ఆవిష్కరణ కార్యక్రమంలో రష్మిక మందన్న ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలోని టైటిల్ గీతాన్ని మళ్లీ తెరకెక్కిస్తున్నామని తెలియగానే తనకు భయ-ంమేసిందని ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న వెల్లడించారు. అలాంటి గొప్ప పాట స్థాయిని పూర్తిగా అందుకోలేకపోయినా, దానికి న్యాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేశామని చెప్పారు. రష్మిక ప్రధాన పాత్రలో రవీంద్ర పుల్లె దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మైసా'. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో సముద్రఖని, రావు రమేశ్, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవంబర్ 27న విడుదల కానున్న ఈ చిత్రంలో 'ఒసేయ్ రాములమ్మ' టైటిల్ గీతాన్ని కొత్త రూపంలో రూపొందించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర బృందం ఈ పాటను విడుదల చేసింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ 1997లో విడుదలైన 'ఒసేయ్ రాములమ్మ' అప్పట్లోనే సంచలనం సృష్టించిందని గుర్తుచేశారు. ఎంతో ముందు చూపుతో రూపొందించిన ఆ చిత్రం ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. "అలాంటి గొప్ప చిత్రంలోని పాటను మళ్లీ తెరకెక్కించడం సాధారణ విషయం కాదు. ఆ విషయం తెలియగానే భయ మేసింది. అసలు పాటను పూర్తిగా మ్యాచ్ చేయ లేమని మాకు తెలుసు. అయినప్పటికీ దాని గొప్ప తనాన్ని నిలబెట్టేలా మా వంతు కృషి చేశాం. ఈ పాటకు వందేమాతరం శ్రీనివాస్ గాత్రం అందించడం మరింత ఆనందాన్ని ఇచ్చింది" అని పేర్కొన్నారు. అప్పట్లో 'ఒసేయ్ రాములమ్మ' పాటకు ప్రేక్షకులు అందించిన ఆదరణను తమ కొత్త గీతానికి కూడా అందిస్తారని ఆశిస్తున్నట్లు రష్మిక తెలిపారు. ప్రేక్షకులు ఈ ప్రయత్నాన్ని ప్రేమతో స్వీకరించాలని కోరారు. ఒకప్పటి సంచలన గీతాన్ని కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నంగా రూపొందించిన ఈ పాట 'మైసా' చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది.

భూమి పెడ్నేకర్ అందాల విస్ఫోటనం..

పాత వింటేజ్ సిల్క్ చీరలతో సరికొత్త ఫ్యాషన్ ప్రయోగం!

ముంబై/హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే బాలీవుడ్ భామ భూమి పెడ్నేకర్, సోషల్ మీడియా వేదికగా తన గ్లామర్ ఫొటోషూట్లతో అభిమానులను కట్టిపడేస్తున్నారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పంచుకున్న సరికొత్త ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ముంబైలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'ఎర్త్‌షాట్ ప్రైజ్ 2026' వేడుక కోసం భూమి ఈ ప్రత్యేక వస్త్రధారణలో మెరిశారు. పర్యావరణ అనుకూల ఫ్యాషన్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో రూపొందించిన ఈ దు-స్తులపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. వింటేజ్ చీరలతో కొత్త ప్రయోగం.. ఆకట్టుకుంటున్న లుక్:ఈ బోల్డ్, స్టైలిష్ డ్రెస్ వెనుక ఉన్న ఆసక్తికర విషయాన్ని భూమి పెడ్నేకర్ స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడించారు. పాతకాలపు ఎంబ్రాయిడరీ వర్క్ ఉ న్న వస్త్రాలు, వింటేజ్ సిల్క్ చీరలను రీసైకిల్ చేసి ఈ కొత్త డ్రెస్‌ను తయారు చేసినట్లు ఆమె తెలిపారు. బ్రౌన్ కలర్ ఎంబ్రాయిడరీ టాప్‌కు జతగా డ్రేప్డ్ బ్లూ శాటిన్ స్కర్ట్ ధరించి, వదులైన కురులు, సంప్రదాయ ఆభరణాలతో భూమి ఇచ్చిన పోజులు ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ డిజైనర్ లేబుల్ 'బోడ్‌మెంట్స్' రూపొందించిన ఈ అవుట్‌ఫిట్‌కు, 'ఆమ్రపాలి జ్యువెల్స్' ఆభరణాలను జతచేశారు. భారతీయ హస్తకళా వారసత్వాన్ని, సస్టెయినబుల్ ఫ్యాషన్‌ను చాటిచెప్పేలా ఉన్న భూమి పెడ్నేకర్ లేటెస్ట్ ఫొటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది.





'హైందవ' విడుదలకు బ్రేక్.. కొత్త తేదీ కోసం నిరీక్షణ!

నవంబర్ 27న రావాల్సిన చిత్రం వాయిదా

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హైందవ' విడుదల వాయిదా పడింది. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని తొలుత నిర్ణయించారు. అయితే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు మెరుగైన సినీ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మూన్‌షైన్ పిక్చర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. కొత్త విడుదల తేదీని త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంటూ అభిమానుల సహనానికి, మద్దతుకు కృతజ్ఞతలు తెలిపింది. రంగాపురం అనే గ్రామం నేపథ్యంలో సాగే ఉత్కంఠభరిత కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ అకస్మాత్తుగా మాయమవడం, అదే సమయంలో ఓ గ్రామస్థుడు హత్యకు గురికావడంతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. నిర్ణీత సమయంలోగా విగ్రహాలు తిరిగి వస్తాయని ఆలయ పూజారి విశ్వసిస్తుండగా, ఈ రహస్యాన్ని ఛేదించేందుకు దేవుడి కంటే మానవత్వాన్ని నమ్మే నాస్తిక పోలీసు అధికారి రంగంలోకి దిగుతాడు. విశ్వాసం, హేతువాదం మధ్య సంఘర్షణ నేపథ్యంలో కథ సాగనుంది. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. మహేష్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఆలయ పూజారిగా మహేష్ మంజ్రేకర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీష్ కన్నన్ ఛాయాగ్రహణం, కార్తీక శ్రీనివాస్ కూర్పు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విభిన్న కథాంశంతో రూపొందుతున్న 'హైందవ' కొత్త విడుదల తేదీపై చిత్ర బృందం ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



'ఇడుపు కాయితం' పెళ్లి పాట విడుదల

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. దొండపాటి వంశీరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ప్రచారంలో భాగంగా తాజాగా ఈ చిత్రంలోని పెళ్లి పాటను విడుదల చేశారు. 'గోగులు గోగులు.. గోపాల కృష్ణుడు..' అంటూ సాగే ఈ పెళ్లి పాటకు కొంగరి కృష్ణ సాహిత్యం (లిరిక్స్) అందించారు. విడుదలైన పాటతో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, డిసెంబర్ 11న థియేటర్లలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**